
ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 05 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 22 | పేజీలు: 4 వెల: 5

# జంగా అంటే.. వ్యక్తి కాదు..వ్యవస్థ

## ఐదు నియోజకవర్గాల్లో నాకు స్పష్టమైన ఓటు బ్యాంకు!

- విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం పోరాటం
- నిర్బంధాల నుంచే నా నాయకత్వ ప్రస్థానం
- ఇప్పుడంతా పవర్ అండ్ మనీ పాలిటిక్స్..
- డీసీసీబీ, ఆయిల్‌ఫెడ్ బాధ్యతల్లో రైతుల సంక్షేమమే నా లక్ష్యం
- గ్రేటర్ వరంగల్ మేయర్ రేసులో ఉన్నా
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా బరిలో ఉంటా
- ఎలాంటి పరిణామాలకైనా సిద్ధపడే ఉన్నా
- అవసరమనుకుంటే నా చిన్న కూతురు నిఖితారెడ్డి రాజకీయాల్లోకి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తాజా మాజీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం పనిచేశా. ప్రజా ఉద్యమాల్లో ఉన్నా. అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ ఎదిగినవాడిని. నిర్బంధాలు ఎదురైతే పారిపోయే వ్యక్తిని కాదు. పదవులు ఉన్నా లేకపోయినా, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్యే ఉంటున్నా. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్నా. ఒక మాట మాత్రం చెబుతున్నా.. జంగా అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఒక వ్యవస్థ. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేకంగా పనిచేసే సైన్యం ఉంది. అక్కడి ప్రజలతో, కార్యకర్తలతో నాకు ఉన్న అనుబంధం అలాంటిది. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో నా పాత్ర కీలకంగా ఉంటుంది. పదవుల కోసం నా రాజకీయ ప్రస్థానం మొదలుకాలేదు. ప్రజల కోసం పనిచేయడం నుంచే నా ప్రయాణం మొదలైంది. ఎన్నో కష్టాలు, నిర్బంధాలు, ఒడిదుడుకులు దాటుకుంటూ ఈ స్థాయికి వచ్చా. ఇక ముందూ ఎలాంటి పరిణామాలు ఎదురైనా సిద్ధంగానే ఉంటానంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!



4







# కేబినెట్‌లో కొత్త ముఖాలు

## కాంగ్రెస్‌లో మొదలైన కసరత్తు!

- సురేఖ స్థానంలో కొత్తగా ఒకరికి అవకాశం
- 2 బెర్తులూ ఒకేసారి భర్తీ చేసే యోచన
- మహేశ్‌గౌడ్‌కు మంత్రి పదవి.. డిప్యూటీ సీఎం?
- విజయశాంతి పేరుపైనా అధిష్ఠానం యోచన
- చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులపై కొత్త ఫార్ములా
- ఢిల్లీ పర్యటన తర్వాత వేగం.. గవర్నర్‌తో సీఎం భేటీ

**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** తెలంగాణ కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్‌లో కసరత్తు ముమ్మరమైనట్లు ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి కొండా సురేఖ స్థానంలో కొత్త మంత్రిని నియమించడంతోపాటు.. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మరో బెర్తును కూడా ఒకేసారి భర్తీ చేయాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ మేరకు ఢిల్లీ పర్యటనలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అవసరమైన సంకేతాలు అందినట్లు సమాచారం. సురేఖ బర్తరఫ్‌తో ఏర్పడిన ఖాళీని ఎక్కువకాలం కొనసాగించకుండా త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్‌తో సీఎం భేటీ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ అంశం కూడా చర్చకు వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ భేటీలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నారన్నది అధికారికంగా వెల్లడికాలేదు.

**మహేశ్‌గౌడ్‌కు మంత్రి పదవి?**

కొత్తగా కేబినెట్‌లోకి ఎవరిని తీసుకోవాలన్న చర్చలో

........(తరువాయి 2లో)

# భూముల చుట్టూ రేవంత్



## 22ఏతో రైతుల బతుకులు ఆగమాగం

- కాగజ్‌నగర్‌లో 42,867 ఎకరాలు 22ఏ జాబితాలో బందీ
- పేదల భూములకు ఒక న్యాయం.. ముఖ్యమంత్రికి మరో న్యాయమా?
- రైతులను కబ్జాదారులుగా అవమానించిన సీఎం క్షమాపణ చెప్పాలి
- వెయ్యి రోజుల పాలనలో పెన్షన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ బంద్
- మళ్లీ కేసీఆర్ వస్తేనే తెలంగాణ బాగుపడుతుంది
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీ మంత్రి హరీశ్‌రావు

**కాకతీయ, సిర్పూర్ :** సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే..కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూ రేవంత్‌రెడ్డి తిరుగుతున్నాడని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఏకంగా 42,867 ఎకరాల రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టి వారి నోటికాడి బుక్కను లాక్కున్నారని మండిపడ్డారు. రైతులను కబ్జాదారులుగా అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కౌటాల, సెప్టెంబరు 4: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల వైఫల్యాలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్

........(తరువాయి 2లో)



3

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానివ్వం

- తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం
- పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరినే తీసుకుంటాం
- రాజగోపాల్‌రెడ్డి వచ్చినా చేర్చుకునేది లేదు
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

# కాంగ్రెస్‌కు కొండా గుడ్‌బై?

## బీఆర్ఎస్‌తో దంపతుల మంతనాలు!

- కేటీఆర్ నేరుగా కొండా సురేఖకు ఫోన్
- గత విభేదాలకు ముగింపు.. బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం
- బీజేపీపై అనుచరుల్లో సందేహాలు..
- వరంగల్ తూర్పులో ముస్లిం ఓట్లే కీలకమవడంతో ఆ పార్టీకి దూరంగా ఉండాలని యోచన
- మరోవైపు బీసీ నినాదంతో సొంత పార్టీ ఆలోచనలో కొండా మురళి
- బీసీ సంఘాలతో వరుస సంప్రదింపులు
- త్వరలోనే బిగ్ అప్‌డేట్.. కొండా సురేఖ పోస్టుతో రాజకీయ కలకలం



**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్‌లో కొండా కుటుంబం కొనసాగడంపై అనుమానాలు బలపడుతున్నాయి. మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తప్పించిన పరిణామాల నేపథ్యంలో.. ఆ కుటుంబం తదుపరి రాజకీయ అడుగులపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్, బీజేపీ నేతలు కొండా దంపతులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతుండగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా కొండా దంపతులతో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన అనుభవం ఉండటం, ఆ పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకున్న పరిస్థితి లేకపోవడం ఇప్పుడు ఆ కుటుంబానికి బీఆర్ఎస్ వైపు తిరిగి చూసే అవకాశాన్ని పెంచినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు బీజేపీ నుంచి కూడా కొందరు నేతలు టచ్‌లోకి వెళ్లినప్పటికీ.. ఆ పార్టీ వైపు వెళ్లే విషయంలో కొండా అనుచరుల్లోనే సందేహాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్‌లో చేరాలా, లేక బీసీ నినాదంతో సొంత రాజకీయ వేదిక ఏర్పాటు చేయాలా అన్న డైలమాలో కొండా కుటుంబం ఉన్నట్లు సమాచారం.

**కేటీఆర్ ఫోన్.. కొండాకు ఆహ్వానం**

కొండా కుటుంబంతో బీఆర్ఎస్

........(తరువాయి 2లో)




# ఇదేమీ విచిత్రమో!

- డీటీవో సెలవులో ఉన్న ఆయన పేరుతోనే సర్టిఫికెట్ల జారీ
- ఇన్చార్జి బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించలేదు
- నిబంధనలకు విరుద్ధంగా జిల్లా రవాణా శాఖ అధికారి వ్యవహారం
- సెలవులోనూ ఇన్చార్జి బాధ్యతలను అప్పగించని అధికారి
- గతంలోనూ ఇలాగే అనేక సార్లు చేసినట్లుగా ఆరోపణలు
- డీటీవో లాగిన్ వినియోగంపై ఉన్నతాధికారుల విస్మయం

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జిల్లా రవాణాశాఖ అధికారి ఈశ్వర్ సింగ్ ఠాకూర్ (డీటీఓ) అధికారిక లాగిన్ వినియోగంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెప్టెంబరు 2న డీటీఓ ఈశ్వర్ సింగ్ ఠాకూర్ నిర్మల్ జిల్లా కోర్టుకు వెళ్లి కార్యాలయంలో అందుబాటులో లేని సమయంలోనూ ఆయన పేరుతో ఉన్న లాగిన్ నుంచి ధ్రువపత్రాలు జారీ అయ్యాయి. అధికారి కార్యాలయంలో లేని వేళ ఆయన లాగిన్‌ను ఎవరు ఉపయోగించారు?

........(తరువాయి 2లో)



GOVERNMENT OF TELANGANA
Transport Department
FORM 3
[See Rule 3(a) and 13]
LEARNER'S LICENCE

Fee Details Rs.550.0/- /TG26Z/1085294 /02-09-2026

1. Licence No. TG037/0002152/2026
2. Name
3. Father's Name
4. Date of Birth 14-07-2005
5. Optional/Blood Group-RH Factor Unknown
6. Present Address
7. Permanent Address
8. Marks of Identification (1) (2)

A holder of this Learner's Licence is licenced to drive throughout India as a learner subject to the provisions of rule 3 of the Central Motor Vehicles Rules 1989, a motor vehicle of the following
Motor Cycle with Gear(Non Transport), LIGHT MOTOR VEHICLE,
This Licence is valid from 02/09/2026 TO 01/03/2027
The Applicant can take driving test after 30 days

MOTOR VEHICLES INSPECTOR
Addl. Licencing Authority
RTA Mulugu Dist.

NO SLOT BOOKING NO DRIVING TEST

# రాజకీయాలు నర్సరీ రైమ్ కాదు





- పరకాల టికెట్ ప్రకటించేందుకు రేవంత్‌కు ఏం రైట్ ఉంది
- పదేళ్లు నేనే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి ప్రకటించుకోవడమేంటి..?!
- నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీలో ఎవరుంటారనేది అందరికీ తెలుసు
- ముందుగా ఆయనపైనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి
- నేషనల్ మీడియాతో కొండా సుస్మిత ఘాటు వ్యాఖ్యలు

2




# సురేఖకు సారయ్య సవాల్

- దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేయండి
- సీఎంను తిడితే ఊరుకునేది లేదు
- బీసీ కార్డుతో రాజకీయ లబ్ధి పొందుతున్నారంటూ విమర్శ
- బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ
- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

3

# కాంగ్రెస్‌కు కొండా గుడ్‌బై..?



(మొదటిపేజీ తరువాయి)
మళ్లీ మంతనాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. కేటీఆర్ స్వయంగా కొండా సురేఖకు ఫోన్ చేసి మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో జరిగిన విభేదాలను పక్కనపెట్టి.. ఇకపై అలాంటి పరిస్థితులు ఉండవని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. కొండా సురేఖను అక్కగా సంబోధిస్తూ పార్టీలోకి రావాలని కేటీఆర్ ఆహ్వానించినట్లు సమాచారం. అయితే కొండా దంపతులు మాత్రం ఇప్పటి వరకు బీఆర్ఎస్‌లో చేరుతామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని తెలుస్తోంది. కేటీఆర్ ఫోన్ చేసిన విషయం బయటకు వచ్చిన తర్వాత కొండా సురేఖ కొన్ని టీవీ చర్చల్లో చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలో తాను పనిచేసిన పార్టీలతో పోలిస్తే వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత కేసీఆర్ చాలా మంచి నాయకుడన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేయడం.. బీఆర్ఎస్‌తో మళ్లీ సాన్నిహిత్యం పెరుగుతున్నదనే చర్చకు బలం చేకూర్చింది.

**అప్పుడేం జరిగింది?**
గతంలో కొండా దంపతులు బీఆర్ఎస్‌లో పనిచేశారు. అయితే వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పరిణామాల్లో ఏర్పడిన విభేదాల కారణంగా వారు ఆ పార్టీకి దూరమయ్యారు. అప్పట్లో జరిగినవి పెద్ద రాజకీయ ఆరోపణలు, అవినీతి వ్యవహారాలు కాదని.. పార్టీలో తమకు కొంత స్వతంత్రత, ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న ఆకాంక్షతోనే విభేదాలు వచ్చాయని కొండా సురేఖ గతంలో పలుమార్లు చెప్పినట్లు వారి సన్నిహితులు గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా అప్పటి తూర్పు ఎమ్మెల్యే వర్గానికి సంబంధించిన కార్యక్రమాలు, అప్పటి మేయర్ నన్నపనేని నరేందర్ తదితరులతో సమావేశాలు తమకు తెలియకుండా జరగడం వంటి పరిణామాలు ఆమెను మనస్తాపానికి గురిచేశాయని ఆమె గతంలో కొన్ని చర్చల్లో వెల్లడించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన కొండా దంపతులు ఇప్పటివరకు అదే పార్టీలో కొనసాగుతున్నారు. అయితే తాజా పరిణామాలతో గతంలోని ఆ విభేదాలు మళ్లీ రాజకీయ చర్చకు వచ్చాయి.

**బీజేపీ వైపు ఎందుకు వెనకడుగు?**
కొండా దంపతులతో బీజేపీకి చెందిన ఒకరిద్దరు కాదు.. పలువురు నేతలు సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అయితే ఆ పార్టీ వైపు వెళ్లడంపై కొండా కుటుంబం పెద్దగా ఆసక్తి చూపడం లేదని వారి అనుచర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఉన్న సామాజిక, రాజకీయ ఓటు సమీకరణాలేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొండా దంపతుల అనుచర వర్గంలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారు గణనీయంగా ఉన్నారని, తూర్పు నియోజకవర్గ రాజకీయాల్లోనూ ముస్లిం ఓటు బ్యాంకు కీలకంగా ఉంటుందని వారి అనుచరులు చెబుతున్నారు. బీజేపీలో చేరితే ఆ ఓటు బ్యాంకుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళన వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే బీజేపీ నుంచి వచ్చిన ప్రతిపాదనలపై పెద్దగా మొగ్గు చూపకుండా.. బీఆర్ఎస్ లేదా సొంత రాజకీయ వేదిక అనే రెండు మార్గాలపైనే కొండా కుటుంబం దృష్టి పెట్టినట్లు సమాచారం.

**బీసీ నినాదంతో కొత్త పార్టీ?**
బీఆర్ఎస్‌లో చేరడం ఒక మార్గమైతే.. సొంత రాజకీయ పార్టీ ఏర్పాటు చేయడంపైనా కొండా మురళి ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వివిధ కుల సంఘాలతో ఆయన నేరుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. కొన్ని సంఘాల ప్రతినిధులతో సమావేశమై.. బీసీ సామాజిక వర్గం ఆధారంగా స్వతంత్ర రాజకీయ వేదిక ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది, ఇప్పటికే ఉన్న రాజకీయ పార్టీలో చేరడం మంచిదా అనే అంశాలపై సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీసీ నినాదంతో కొత్త రాజకీయ శక్తిని నిర్మించే అవకాశాలపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఇది ఇప్పటికీ ఆలోచనల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై కొండా కుటుంబం తమ సన్నిహితులు, అనుచరులు, వివిధ సామాజిక వర్గాల నేతల అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్లు సమాచారం.

**బీఆర్ఎస్‌లోనూ గందరగోళమే!**
కొండా దంపతులు తిరిగి బీఆర్ఎస్‌లోకి వస్తారన్న ప్రచారం ఆ పార్టీలోనూ చర్చకు దారితీసింది. అయితే వరంగల్ జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు మాత్రం తమకు ఈ విషయంలో ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు మరికొందరు సీనియర్ నేతలను సంప్రదించినప్పుడు.. కొండా దంపతులు బీఆర్ఎస్‌లోకి వస్తున్నట్లు తమకు తెలియదని, పార్టీ అధిష్ఠానం నుంచి కూడా ఎలాంటి సమాచారం అందలేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో కేటీఆర్ స్థాయిలో జరుగుతున్న సంప్రదింపులు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఎంతవరకు తెలుసన్నది కూడా ఆసక్తికరంగా మారింది. మరోవైపు కేటీఆర్ స్వయంగా సంప్రదింపులు జరిపినట్లు వస్తున్న సమాచారంతో.. అధిష్ఠానం స్థాయిలో ఏదైనా వ్యూహం సిద్ధమవుతోందా అన్న చర్చ మొదలైంది.

**కొండా పోస్టుతో మరింత ఉత్కంఠ**
ఈ రాజకీయ పరిణామాల మధ్య కొండా సురేఖకు సంబంధించిన సామాజిక మాధ్యమ పోస్టులు మరింత ఆసక్తిని రేపుతున్నాయి. ఆమె పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతాల్లో ఒకదానిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో త్వరలోనే బిగ్ అప్‌డేట్ రానుందనే అర్థం వచ్చేలా పోస్టు పెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అదే సమయంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరో పోస్టుపై తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ మరో సందేశం వెలువడింది. ఒకవైపు త్వరలో కీలక ప్రకటన ఉంటుందన్న సంకేతం.. మరోవైపు కొన్ని పోస్టులతో తమకు సంబంధం లేదన్న వివరణ రావడం కొండా కుటుంబం నుంచి ఏదో కీలక రాజకీయ ప్రకటనకు రంగం సిద్ధమవుతోందా అన్న ఉత్కంఠను పెంచింది. ప్రస్తుతం కొండా కుటుంబం ముందున్న మూడు మార్గాలపై రాజకీయ చర్చ సాగుతోంది. కాంగ్రెస్‌లోనే కొనసాగడం, బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లడం, బీసీ నినాదంతో సొంత రాజకీయ వేదిక ఏర్పాటు చేయడం.. ఈ మూడింటిలో ఏ దారిని ఎంచుకుంటారన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. అయితే తాజా పరిణామాలు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఆహ్వానం, కొండా సురేఖ వ్యాఖ్యలు, కొండా మురళి బీసీ సంఘాలతో జరుపుతున్నట్లు చెబుతున్న సంప్రదింపులు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సంకేతాలను కలిపి చూస్తే.. కాంగ్రెస్‌లో కొండా కుటుంబం భవిష్యత్‌పై మాత్రం రాజకీయంగా పెద్ద ప్రశ్నే తలెత్తింది.

# కేబినెట్‌లో కొత్త ముఖాలు

(మొదటిపేజీ తరువాయి)
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆయనకు మంత్రి పదవి ఇస్తే.. డిప్యూటీ సీఎం బాధ్యతలు కూడా అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ప్రభుత్వంలోకి తీసుకుంటే టీపీసీసీ అధ్యక్ష పదవిలో మార్పు చేయాల్సి ఉంటుంది. ఆ పదవిని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌కు అప్పగించే అవకాశాన్ని కూడా పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మార్పుల ద్వారా ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయాన్ని మరింత పెంచడంతోపాటు.. సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**విజయశాంతికి అవకాశం దక్కేనా?**
మరో మంత్రి పదవికి ఎమ్మెల్సీ విజయశాంతి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ స్థానంలో బీసీ మహిళకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉంటే విజయశాంతి పేరును పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా కనిపించకపోయినా.. కీలక బాధ్యత అప్పగిస్తే తిరిగి రాజకీయంగా క్రియాశీలం అవుతారన్న అభిప్రాయం పార్టీలో ఉంది. పార్టీ భవిష్యత్ వ్యూహం, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గ కూర్పు చేయాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. అయితే తుది ఎంపికపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయమే కీలకం కానుంది.

**విప్.. డిప్యూటీ స్పీకర్ ఫార్ములా**
కేబినెట్ విస్తరణతోపాటు అసెంబ్లీలో కీలక పదవుల భర్తీపైనా ముఖ్యమంత్రి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్ పదవికి రామచంద్ర నాయక్ పేరును గతంలో ప్రకటించినప్పటికీ.. ఇప్పటివరకు ఆయన ఆ బాధ్యతలు చేపట్టలేదు. ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా ఉన్న రామచంద్ర నాయక్ మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు సీనియర్ ఎమ్మెల్యే బాలు నాయక్ కూడా మంత్రివర్గంలో చోటు కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. వీరిద్దరిలో ఒకరికి చీఫ్ విప్, మరొకరికి డిప్యూటీ స్పీకర్ బాధ్యతలు అప్పగించే ఫార్ములాను సీఎం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రివర్గంలో చోటు దక్కని ఆశావహులకు అసెంబ్లీ కీలక పదవులు కట్టబెట్టి అసంతృప్తిని తగ్గించవచ్చని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

**స్పీకర్ విషయంలో వెనక్కి తగ్గినట్టే**
ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్న గడ్డం ప్రసాద్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం గతంలో సాగింది. అయితే తాజా ఢిల్లీ పర్యటనలో ఆయనకు ఈ విషయంలో సానుకూల సంకేతాలు రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆయన స్పీకర్‌గానే కొనసాగుతారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఇదే సమయంలో ఒకరిద్దరు మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. కొందరు మంత్రులను తప్పించే అవకాశాలపై ప్రచారం జరుగుతున్నప్పటికీ.. దీనిపై కాంగ్రెస్ పార్టీగానీ, ప్రభుత్వంగానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. శాఖల పనితీరు, పార్టీప్రభుత్వ సమన్వయం, రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మార్పులు చేపట్టే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు.

**ఖాళీల భర్తీనా..**
**వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణా?**
మంత్రివర్గ విస్తరణ కేవలం ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడానికే పరిమితం కాకపోవచ్చన్న చర్చ కాంగ్రెస్‌లో మొదలైంది. పార్టీని బలోపేతం చేయడం, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, ప్రభుత్వంపార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడం, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ సమీకరణాలను సరిచేయడం వంటి అంశాలు కూడా కూర్పులో కీలకం కానున్నట్లు తెలుస్తోంది. కొత్త మంత్రుల ఎంపికతోపాటు శాఖల మార్పులు, పార్టీ పదవుల్లో మార్పులు చోటుచేసుకుంటే తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేచే అవకాశం ఉంది. ఢిల్లీ పర్యటన తర్వాత మంత్రివర్గ విస్తరణపై చర్చ వేగం పుంజుకోవడం, గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీలోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు వార్తలు రావడంతో త్వరలోనే నిర్ణయం వెలువడుతుందన్న అంచనాలు పెరిగాయి. అయితే ఎవరికి మంత్రి పదవి దక్కుతుంది, ఎవరికి కీలక అసెంబ్లీ పదవులు కట్టబెడతారు, పార్టీ పదవుల్లో ఎలాంటి మార్పులు ఉంటాయన్నది మాత్రం చివరి వరకు ఉత్కంఠగా మారనుంది.

# రాజకీయాలు నర్సరీ రైమ్ కాదు



- **పరకాల టికెట్ ప్రకటించేందుకు రేవంత్‌కు ఏం రైట్ ఉంది**
- **పదేళ్లు నేనే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి ప్రకటించుకోవడమేంటి..?!**
- **నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీలో ఎవరుంటారనేది అందరికీ తెలుసు**
- **ముందుగా ఆయనపైనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి**
- **నేషనల్ మీడియాతో కొండా సుస్మిత ఘాటు వ్యాఖ్యలు**

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** పరకాలకు వెళ్లి కాంగ్రెస్ టికెట్ విషయంలో ప్రకటన చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏం రైట్ ఉందని కొండా సుస్మిత్ పటేల్ విమర్శించారు. రాజకీయాలు నర్సరీ రైమ్ కాదు.. తాను పాఠశాలకు వెళ్లకుండా, పద్యం సరిగ్గా చెప్పకుండా ఇంటికి వస్తే తల్లి మందలించినట్టుగా రాజకీయాలను చూడొద్దని కొండా సుస్మిత అన్నారు. గురువారం నేషనల్ మీడియాకు చెందిన ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున ఎవరు పోటీ చేయబోతున్నారో అందరికీ తెలుసని, టికెట్ ప్రకటించే అధికారం సీఎం రేవంత్ రెడ్డికి లేదని స్పష్టం చేశారు. పరకాలకు వెళ్లి టికెట్ గురించి ఆయన మాట్లాడటం సరికాదన్నారు. తాము రాజకీయాలను చిన్న పిల్లల ఆటగా చూడటం లేదని, పార్టీ టికెట్ విషయంలో నిర్ణయం తీసుకునే వ్యవస్థ కాంగ్రెస్‌లో ఉందని పేర్కొన్నారు.
టికెట్ విషయంలో ప్రకటనలు చేస్తున్న వ్యక్తిపై ముందుగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కొండా సుస్మిత డిమాండ్ చేశారు. తనకు టికెట్ ఎవరు ఇస్తారు, ఎవరు ప్రకటిస్తారు అనే విషయం పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి తాము బరిలోకి దిగబోతున్న విషయం అందరికీ తెలుసన్నారు.

**10 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని ఎవరు చెప్పారు?**
కాంగ్రెస్ పార్టీలో ఎవరూ 10 ఏళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పలేదని కొండా సుస్మిత అన్నారు. ముఖ్యమంత్రి పదవిపై రేవంత్ రెడ్డి ప్రకటన చేయడానికి ఆయన ఎవరు అని ప్రశ్నించారు. పార్టీలో చాలా మంది సీనియర్ నాయకులు ఉన్నారని, చివరకు డాక్టర్ వైఎస్సార్ కూడా ఎప్పుడూ తాను 10 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పలేదని పేర్కొన్నారు.

# ఇదేమీ విచిత్రమో..!

(మొదటిపేజీ తరువాయి)
ఏ అధికారం మేరకు కార్యకలాపాలు నిర్వహించారు? అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. డీటీఓ విధులకు దూరంగా ఉన్నప్పుడు కార్యాలయ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ప్రత్యామ్నాయ అధికారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. సెప్టెంబరు 2న డీటీఓకు సెలవు లేదా శాఖాపరమైన అనుమతి ఉందా? ఉంటే ఆ రోజు ఇన్‌చార్జ్‌గా ఎవరిని నియమించారు? ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారా? అన్న వివరాలను రవాణాశాఖ వెల్లడించాలి. ఇన్‌చార్జ్ నియమించి ఉంటే ఆ అధికారి పేరుతోనే అధికారిక కార్యకలాపాలు ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.




**లాగిన్ నుంచే ధ్రువపత్రాలా?**
డీటీఓకు కేటాయించిన అధికారిక లాగిన్ ద్వారా శాఖాపరమైన కీలక ప్రక్రియలు జరుగుతాయి. అలాంటి లాగిన్ నుంచి అధికారి అందుబాటులో లేని సమయంలో ధ్రువపత్రాలు జారీ అయ్యాయనే ఆరోపణలు రావడం సాధారణ అంశం కాదు. ఆ రోజు లాగిన్ ఎప్పుడు తెరవబడింది? ఏ కంప్యూటర్ లేదా వ్యవస్థ నుంచి వినియోగించారు? ఎన్ని ధ్రువపత్రాలు జారీ అయ్యాయి? అన్న వివరాలు లాగిన్ లాగ్స్ పరిశీలిస్తే స్పష్టమయ్యే అవకాశం ఉంది. లాగిన్ వివరాలు ఇతరులకు చేరాయా? లేక అధికారిక అనుమతితోనే వినియోగించారా? అన్నదీ విచారణలో తేలాలి.

**ఉన్నతాధికారులకు సమాచారం ఉందా?**
డీటీఓ కోర్టుకు వెళ్లిన విషయం ఉన్నతాధికారులకు ముందే తెలుసా? ఆయనకు అనుమతి ఉందా? కార్యాలయ బాధ్యతలను మరొక అధికారికి అప్పగించారా? అన్న అంశాలపై స్పష్టత అవసరం. ఒకవేళ అన్ని అనుమతులతోనే ప్రక్రియ కొనసాగితే ఆ రోజు లాగిన్ వినియోగానికి సంబంధించిన విధానాన్ని శాఖ వివరించాలి. అనుమతి లేకుండా అధికారి కార్యాలయానికి దూరంగా ఉన్నట్లయితే దానిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయంలో అధికారి అందుబాటులో లేకపోయినా ఆయన పేరుతో అధికారిక వ్యవహారాలు సాగుతున్నాయనే ఆరోపణలు రావడం పర్యవేక్షణ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఉందా?**
ములుగు రవాణాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించాల్సిన వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తుల జోక్యం ఉంటోందన్న ఆరోపణలు గతంలోనూ వినిపించినట్లు స్థానికంగా చర్చ ఉంది. ఈ నేపథ్యంలో డీటీఓ లాగిన్ ఇతరుల చేతికి వెళ్లిందా? ప్రైవేటు వ్యక్తులు దానిని వినియోగించారా? అన్న అనుమానాలకు కూడా ఉన్నతాధికారులు తెరదించాల్సి ఉంది. అధికారిక లాగిన్ వివరాలను ఇతరులకు అందించినట్లు తేలితే బాధ్యత ఎవరిదన్నది కూడా నిర్ణయించాలి. డీటీఓ గతంలో నిర్వహించిన చెక్‌పోస్టు విధులపైనా డబ్బుల వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత లాగిన్ వ్యవహారంతోపాటు గత ఫిర్యాదులు, విధుల నిర్వహణకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా స్పష్టం చేయాలి. వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

**లాగిన్ లెక్క తేల్చాల్సిందే!**
సెప్టెంబరు 2న జరిగిన వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. డీటీఓ హాజరు, సెలవు లేదా అనుమతి వివరాలు, ఇన్‌చార్జ్ నియామకం, లాగిన్ లాగ్స్, ఆ రోజు జారీ చేసిన ధ్రువపత్రాల వివరాలను పరిశీలించాలి. అధికారిక లాగిన్‌ను ఎవరు వినియోగించారో సాంకేతిక ఆధారాలతో నిర్ధారించాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. లేకపోతే డీటీఓ కార్యాలయంలో లేకున్నా ఆయన లాగిన్ ఎలా పనిచేసిందన్న ప్రశ్నకు సమాధానం దొరకదు.

# వై99 యాప్‌లో హనీ ట్రాప్..
# రూ.14.75 లక్షల మోసం

- **మహిళగా యువకుడితో పరిచయం పెంచుకున్న నిందితుడు**
- **అత్యవసర అవసరాల పేరుతో పలుమార్లు డబ్బులు బదిలీ**
- **తమిళనాడులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు**

**కాకతీయ, వరంగల్ :** వై99 యాప్ ద్వారా యువకుడిని హనీ ట్రాప్‌లోకి దించి రూ.14.75 లక్షలు మోసం చేసిన నిందితుడిని వరంగల్ సైబర్ క్రైమ్ పోలీసులు తమిళనాడులోని సేలం జిల్లాలో అరెస్ట్ చేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తుమ్మ ఉదయ్ కిరణ్ (32) ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 21/2026 కేసు దర్యాప్తులో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో నిందితుడు వై99 వెబ్‌సైట్ ద్వారా 'లావణ్య' అనే మహిళగా బాధితుడికి పరిచయమై, సన్నిహితంగా మెలుగుతూ నమ్మకం పొందినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అత్యవసర అవసరాలు, విద్య-పరిశోధన ఖర్చులు, వైద్య, వ్యక్తిగత అవసరాల పేరుతో భావోద్వేగ ఒత్తిడి తీసుకొచ్చి పలుమార్లు డబ్బులు బదిలీ చేయించుకున్నట్లు తెలిపారు. వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీల ద్వారా మొత్తం రూ.14,75,100 మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక, ఆర్థిక ఆధారాలతో నిందితుడిని గుర్తించిన ప్రత్యేక బృందం సేలం జిల్లాలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించింది. ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత, బ్యాంకు ఖాతా, ఆర్థిక వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని పోలీసులు సూచించారు. సోషల్ మీడియా, డేటింగ్, చాటింగ్ యాప్‌ల ద్వారా పరిచయమయ్యే వ్యక్తులు డబ్బులు అడిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేయాలని లేదా సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బి. శివకృష్ణ, దినేష్, భరత్, జహూర్ మొహమ్మద్ దర్యాప్తులో పాల్గొన్నారు.

# భూముల చుట్టూ రేవంత్

(మొదటిపేజీ తరువాయి)
భారీ నిరసన కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా 22ఏ జాబితాలో తమ భూములు పెట్టారంటూ స్థానిక రైతులు కన్నీటిపర్యంతమై ఆయనకు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

**22ఏతో రైతుల బతుకులు ఆగమాగం**
కౌటాలలో 6,350 ఎకరాలు, చింతలమానేపల్లిలో 8,878, బెజ్జూరులో 8,325, కాగజ్‌నగర్‌లో 6,690, సిర్పూర్ టీలో 4,406, పెంచికల్‌పేట్‌లో 2,950, దహెగాంలో 5,268 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని హరీశ్‌రావు తెలిపారు. భూములు 22ఏలో పడితే రైతుల బతుకులు ఆగమాగం అవుతాయన్నారు. పాత అప్పు కట్టి కొత్త రుణం కోసం బ్యాంకులకు వెళ్తే భూమి ప్రభుత్వ పరిధిలో ఉందంటూ మేనేజర్లు బయటకు పంపిస్తున్నారని తెలిపారు. భూమి రైతు పేరుపై లేకపోతే యూరియా, డీఏపీ దొరకకపోవడంతో పాటు రైతుబంధు, ప్రమాద బీమా కూడా అందని పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డ పెళ్లి కోసం భూమి అమ్ముకుందామన్నా రిజిస్ట్రేషన్ చేయడం లేదని, ఎంఆర్ఓ నుంచి కలెక్టర్ వరకు తిరిగినా న్యాయం జరగడం లేదన్నారు.


**రేవంత్ ఇంటికి ఓ న్యాయం..**
**రైతులకు మరో న్యాయమా?**
కేసీఆర్ గిరిజనులకు 6 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకుంటే.. రేవంత్‌రెడ్డి ఉన్న భూములను గుంజుకుంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్ చుట్టుపక్కల 22ఏలో రెండు లక్షల ఇళ్లను పెట్టారని తాను భావించానని, కానీ ఒక్క సిర్పూర్ కాగజ్‌నగర్‌లోనే 42,867 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 14.50 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక పట్టా భూములనే లాక్కుంటోందన్నారు. రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా 22ఏలో పడితే తాను ఆ విషయం బయటపెట్టగానే రాత్రికి రాత్రే తొలగించుకున్నారని ఆరోపించారు. తన ఇంటిని తొలగించినట్టే సిర్పూర్‌లోని రైతుల భూములను కూడా వెంటనే 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

**పొంగులేటిపై చర్యలు తీసుకోవాలి**
100 ఏళ్ల కిందటి రికార్డులు పరిశీలించి ఆసిఫాబాద్ కలెక్టర్ ప్రభుత్వ ఆదేశాల మేరకే భూములను 22ఏలో పెట్టాలని ప్రభుత్వానికి లేఖ రాశారని హరీశ్‌రావు తెలిపారు. అందువల్ల ఇది అధికారుల తప్పిదం కాదని, ప్రభుత్వ స్థాయిలో జరుగుతున్న కుట్ర అని ఆరోపించారు. ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. పేదల భూములను 22ఏలో పెట్టిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా రేవంత్‌రెడ్డి నిషేధించాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖను విమర్శల కారణంగా మంత్రి పదవి నుంచి తొలగించినప్పుడు.. లక్షలాది మంది ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులను కూడా హెచ్చరిస్తున్నామని, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా భూములను 22ఏ నుంచి తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేకపోతే కోవ లక్ష్మక్క ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహించి అక్కడే పడుకుంటామని ప్రకటించారు. భూములు దక్కే వరకు దళారులకు రూపాయి లంచం ఇవ్వొద్దని రైతులకు సూచించారు.

**వెయ్యి రోజుల పాలనపై విరుచుకుపడ్డ హరీశ్‌రావు**
కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో వెయ్యి కుంభకోణాలు, వెయ్యి కబ్జాలు, వెయ్యి అబద్ధాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని హరీశ్‌రావు విమర్శించారు. కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని, రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ప్రతి అవ్వ, తాతకు రూ.66 వేల బాకీ పడ్డారని అన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 చొప్పున రూ.82,500 బాకీ పడ్డారని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఏడాదికి 2.60 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులు ఇస్తే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక 86 వేలకు పడిపోయాయని ఆరోపించారు. ఈ నియోజకవర్గంలో ఎన్ని కుట్రలు జరిగినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఢిల్లీలో కొట్లాడుకున్నా కాగజ్‌నగర్‌లో మాత్రం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కలిసి వస్తున్నారని విమర్శించారు. కోనేరు కోనప్ప, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక్కటయ్యారని, ఇక ఏ శక్తి ఎదురొచ్చినా తుఫాన్‌లో కొట్టుకుపోవాల్సిందేనన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు.

# బోనస్ పొందాలంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఏఓ స్వామినాయక్

**కాకతీయ ,పెద్దవంగర :** ప్రభుత్వం అందించే బోనస్ పొందాలంటే రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వామినాయక్ అన్నారు. బోనస్‌కు అర్హత కలిగిన ఏడు సన్న రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు విత్తనాల కొనుగోలు బిల్లులు, పట్టాదార్ పాస్‌బుక్‌తో సంబంధిత క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. రైతులు ఆలస్యం చేయకుండా ఈ నెల 10వరకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. నమోదు చేసుకోని రైతులకు ధాన్యం కొనుగోలు



సమయంలో ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వర్తించదని స్పష్టం చేశారు. బోనస్ పొందేందుకు ఆన్‌లైన్ నమోదు కీలకమైనందున అర్హత ఉన్న ప్రతి రైతు వ్యవసాయ అధికారులను సంప్రదించి వెంటనే వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

# ఏటూరునాగారంలో అభివృద్ధిపై పట్టింపేది..?

- వెయ్యి రోజుల పాలనలో హామీలకు దిక్కేది?
- ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై లెక్క చెప్పాలి
- రైతుబంధు, రుణమాఫీపై చెప్పేదొకటి.. చేసేదొకటి
- హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తాం
- ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు




**కాకతీయ, ఏటూరునాగారం:** ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయినా ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేదని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ధ్వజమెత్తారు. కేసీఆర్ ఆదేశాలు, కేటీఆర్ పిలుపు, హరీశ్‌రావు సూచనల మేరకు చేపడుతున్న వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఏటూరునాగారంలో మూడో రోజు బీఆర్ఎస్ నిరసన చేపట్టింది. ఓడవాడ హనుమాన్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి బస్టాండ్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 3 వేల మంది పాల్గొన్నారు. ఈసందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటివరకు ఎన్ని హామీలు అమలు చేసిందో ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధుల పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం, యువతకు రూ.5 లక్షల గ్యారెంటీ కార్డు, విదేశీ విద్య, విదేశాలకు వెళ్లే వారికి రూ.25 లక్షల రుణం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేశామని చెబుతున్న కాంగ్రెస్.. ఇప్పుడు తాము ఇచ్చిన హామీల అమలుపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని నిలదీశారు. రైతుబంధు, రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేదొకటిగా ఉందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలను నమ్మించేందుకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం సరికాదన్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, దివ్యాంగుల సమస్యలను పట్టించుకోవాల్సిన ప్రభుత్వం వాటిపై సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

**ఏటూరునాగారం అభివృద్ధిపై ప్రభుత్వం చేతులేత్తేసింది**

ఏటూరునాగారం అభివృద్ధి విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని లక్ష్మణ్‌బాబు అన్నారు. ఏటూరునాగారం బస్‌డిపో విషయంలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ''మీరు కట్టారా?'' అంటూ ఎదురు ప్రశ్నలు వేయడం కాదని, అధికారంలోకి వచ్చిన తర్వాత బస్‌డిపో ఎందుకు నిర్మించలేదో చెప్పాలని నిలదీశారు. గోదావరి కరకట్ట నిర్మాణం పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యల పరిష్కారం కోసం గోదావరి వెంట పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. కేసీఆర్ హయాంలో మంజూరైన ఏటూరునాగారం ఆర్డీఓ కార్యాలయం మూడేళ్లుగా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. హెచ్ఏఎం రోడ్ల నిర్మాణ విధానంపై కూడా ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడు రోడ్ల నిర్మాణానికి రుణ ఆధారిత విధానాలను ఎందుకు అనుసరిస్తోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన ఇళ్లను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. ఏటూరునాగారంలో మంజూరైన 170 ఇళ్లలో 150 నిర్మాణాలు ప్రారంభమైనప్పటికీ సుమారు 60 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు.

**ఫ్లెక్సీల తొలగింపుతో ఉద్రిక్తత..!**

బస్టాండ్ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పోలీసులు తొలగించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఫ్లెక్సీల తొలగింపుపై లక్ష్మణ్‌బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలీసులతో వాగ్వాదం జరిగింది. మంత్రి సీతక్క ఆదేశాలతోనే ఫ్లెక్సీలు తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ఏటూరునాగారం ఎస్ఐ మహేశ్, లక్ష్మణ్‌బాబు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రతిపక్ష గొంతును నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. మిగిలిన నాలుగు రోజుల కార్యక్రమాలను మరింత ఉధృతంగా నిర్వహిస్తామని లక్ష్మణ్‌బాబు తెలిపారు. యువత కార్యక్రమంతోపాటు ములుగు, వెంకటాపురం ప్రాంతాల్లో భారీ ర్యాలీలు చేపడతామని చెప్పారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మహిళలు, రైతులు, యువత, పేదలు, దివ్యాంగుల సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేపడతామని, హామీలు నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ప్రజల తరపున పోరాడతామని లక్ష్మణ్‌బాబు హెచ్చరించారు.



# కాంగ్రెస్ పాలనలో కక్ష సాధింపు రాజకీయం

- హామీల అమలును పట్టించుకోని ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే, నర్సంపేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- నల్లబెల్లిలో బీఆర్ఎస్ వంటావార్పు
- వెయ్యి రోజుల పాలనపై గులాబీ గర్జన

**కాకతీయ, నల్లబెల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, నర్సంపేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు, 400కు పైగా హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటి అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నల్లబెల్లి బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

**అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే**

కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ పాలన కాదని, 'వెయ్యి రోజుల దుర్మార్గ పాలన' అని ముత్తిరెడ్డి విమర్శించారు. రైతులు, మహిళలు, దివ్యాంగులు, పింఛనుదారులు, ఆటో కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు, అణచివేత ధోరణులకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి సాధించిందని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమవుతోందని విమర్శించారు. కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేరంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రజా సమస్యలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నర్సంపేట నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని, సంక్షేమ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు.

# కాంగ్రెస్ 1,000 రోజుల దగా పాలన

- హామీలు కొండంత.. అమలు శూన్యం
- 6 గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలు మాత్రం శూన్యం
- ఆడబిడ్డలు, వృద్ధులు, రైతులు, యువత, వికలాంగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?
- ప్రజల గొంతును, బీఆర్ఎస్ పోరాటాన్ని అణచలేరు
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**కాకతీయ, చిట్యాల :** ఎన్నికల సమయంలో ప్రజలకు కొండంత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజులు పూర్తయినా వాటి అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. ఆడబిడ్డలు, వృద్ధులు, రైతులు, యువత, వికలాంగులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తాము ప్రతిపక్షంగా ప్రశ్నిస్తున్నామని తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, రైతులకు రూ.15 వేల రైతుభరోసా వంటి హామీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ 1,000 రోజుల దగా పాలనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు సమరభేరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గండ్ర తెలిపారు. ఇందులో భాగంగా చిట్యాల మండల కేంద్రంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సు నిర్వహించడంతో పాటు వంటావార్పు కార్యక్రమం చేపట్టామని చెప్పారు. మహిళలకు రూ.2,500 సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలు అమలు చేయని ప్రభుత్వ తీరుకు నిరసనగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని ప్రజల ఆవేదనను ఫ్లెక్సీల రూపంలో ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా తెలియజేస్తే వాటిని తొలగిస్తున్నారని గండ్ర మండిపడ్డారు. ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన ప్రజల ఆలోచనలను, వారి ఆవేదనను అణచివేయలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును, ప్రజల సమస్యలను అణచివేయడం సరికాదన్నారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై అతిగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టడం సాధ్యం కాదని, భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని చెప్పారు.

**మీడియాపై దాడులపై చర్యలు తీసుకోవాలి**

భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతున్నాయని గండ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాపై జరిగిన దాడి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసు అధికారులను కోరామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, ప్రతిపక్షాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ప్రజలకు ఇచ్చిన అన్ని ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను తక్షణమే నడపాలని గండ్ర వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో పాటు చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలు, భూపాలపల్లి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలను మోసం చేసిన కాంగ్రెస్

- మహిళలకు హామీలిచ్చి దగా చేసిన రేవంత్
- మహాలక్ష్మి సాయం ఎక్కడ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంగతేంటి?
- కాళేశ్వరం పంపులు నడిపి రైతులకు సాగునీరు ఇవ్వాలి
- కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు





**కాకతీయ,పాలకుర్తి/ తొర్రూరు :** 1,000 రోజుల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. మహిళలను హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు తులం బంగారం, కేసీఆర్ కిట్, మహిళలకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మూడో రోజు దేవరుప్పుల, రాయపర్తి, తొర్రూరు మండల కేంద్రాల్లో మహిళలతో వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషా దయాకర్‌రావు పాల్గొన్నారు.

**మహిళల సంక్షేమాన్ని విస్మరించారు**

ఈ సందర్భంగా మాజీమంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలు, వృద్ధులు, రైతులు, యువత, వికలాంగులు సహా అన్ని వర్గాలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వికలాంగుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి ఏనాడైనా ఆలోచించారా అని నిలదీశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించకపోతే కాంగ్రెస్ పని ఖతం అవుతుందని హెచ్చరించారు.

**కేసీఆర్ హయాంలోనే సంక్షేమం**

కేసీఆర్ మహిళల సంక్షేమంపై విజన్ ఉన్న నాయకుడని ఎర్రబెల్లి అన్నారు. ప్రజలు అడగకున్నా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. వృద్ధుల పెన్షన్‌ను రూ.500 నుంచి రూ.2 వేలకు పెంచారని, ఒంటరి మహిళలకు కూడా రూ.2 వేల పెన్షన్ అందించి అండగా నిలిచారని చెప్పారు. వికలాంగులకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చి వారు తమ కాళ్లపై తాము జీవించేలా కృషి చేసిన మహానుభావుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు చేసిందేమీ లేదని, సంచులు నింపుకోవడం తప్ప పాలనపై అవగాహన లేదని ఎర్రబెల్లి విమర్శించారు. కాంగ్రెస్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించడానికి మరో రెండేళ్ల సమయం ఉందని, ఆ తర్వాత మళ్లీ కేసీఆర్ సర్కార్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసింది, చేసేది కూడా కేసీఆర్ మాత్రమేనని, కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. కార్యక్రమాల్లో జిల్లా, మండల బీఆర్ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సురేఖకు సారయ్య సవాల్..

- దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేయండి
- సీఎంను తిడితే ఊరుకునేది లేదు
- బీసీ కార్డుతో రాజకీయ లబ్ధి పొందుతున్నారంటూ విమర్శ
- బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ
- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** మంత్రి కొండా సురేఖకు దమ్ముంటే రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సవాల్ విసిరారు. తాను కూడా ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. వరంగల్ జిల్లాలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మంత్రి కొండా సురేఖపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తిడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తనపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేసింది తానేనని బహిరంగంగా వెల్లడించారు. ఇన్నేళ్లుగా ప్రజల రక్తం తాగి ఇప్పుడు బీసీ కార్డును వాడుకుంటున్నారని సారయ్య ఆరోపించారు. బ్లాక్‌మెయిల్ కల్చర్‌కు పాల్పడుతున్నది మీరేనని మంత్రి సురేఖను ఉద్దేశించి విమర్శించారు. 250 మూగజీవాలను కాల్చింది ఎవరు? కాలిపోయిన స్థలం ఎవరి పేరుపై రిజిస్ట్రేషన్ అయి ఉందో ప్రజలకు తెలుసని ప్రశ్నించారు. ఇలాంటి అరాచకాలకు పాల్పడుతూ నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే సహించేది లేదని సారయ్య హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన

- ఎర్రబెల్లి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషదయాకర్ రావు
- 1000 రోజుల విఫల పాలనపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- పెద్దవంగర అంబేద్కర్ చౌరస్తాలో వంటావార్పు



**కాకతీయ, పెద్దవంగర :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఎర్రబెల్లి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఉషదయాకర్ రావు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వెయ్యిరోజుల కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా నాయకులతో కలిసి వంటవర్పు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

- ప్రత్యేక పూజలు.. విష్ణు పంచాన యాగం
- శ్రీకృష్ణుడిగా అమ్మవారి అలంకరణ
- 21 రకాల భోగాలు సమర్పణ



**కాకతీయ, వరంగల్ :** వరంగల్ చారిత్రక శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. సకలజనుల శ్రేయస్సు, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా జన్మాష్టమి వ్రతాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా విష్ణు పంచాన యాగం నిర్వహించగా, ఉదయం నుంచే భక్తులు కృష్ణనామ స్మరణ చేస్తూ కార్యక్రమాలను తిలకించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అమ్మవారి నిత్యాహ్నికం నిర్వహించి, వ్రతాచరణకు అమ్మవారి అనుజ్ఞ తీసుకుని కార్యక్రమాలు ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు పూజలు పూర్తిచేసిన అనంతరం అమ్మవారిని శ్రీకృష్ణుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరణకు సుమారు గంట సమయం పట్టింది. రాత్రి 8.30 గంటలకు శ్రీకృష్ణ రూపంలో ఉన్న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి 21 రకాల భోగాలను నివేదించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ తదితరులు ఉన్నారు. పూజల అనంతరం ప్రముఖులకు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

# కార్మికుల సమస్యలపై పోరాటం ఆగదు

- గేట్లు వేసి ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం దేనికి సంకేతం?
- కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ధ్వజం



**కాకతీయ, భూపాలపల్లి:** సింగరేణి కార్మికుల హక్కులు, సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన తనను గేట్లు వేసి అడ్డుకోవడం సరికాదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని 5 ఇంక్లైన్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు షూస్, పనిముట్లు, డ్రిల్ బిట్స్ వంటి కనీస సౌకర్యాలు సక్రమంగా అందడం లేదన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ కేంద్రాల నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కార్మికుల కోసం క్వార్టర్లు నిర్మించడంతోపాటు కాలనీల్లో పట్టాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశానన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. తనను అడ్డుకున్నా సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడు ఇనగాలను కలిసిన కుడా చైర్మన్ గుండు సుధారాణి



**కాకతీయ, హనుమకొండ:** వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌గా నియమితులైన గుండు సుధారాణి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన సుధారాణి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి శాలువా కప్పి, కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న గుండు సుధారాణికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానివ్వం

- తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం
- పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరినే తీసుకుంటాం
- రాజగోపాల్‌రెడ్డి వచ్చినా చేర్చుకునేది లేదు
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

**కాకతీయ, హైదరాబాద్ :** మంత్రి కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆమె తెలంగాణ భవన్ గేటు కూడా తాకే పరిస్థితి ఉండదన్నారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరిని మినహాయించి మిగిలిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఇద్దరు ఇప్పటికే బీఆర్ఎస్‌లోకి తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నారని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. అయితే ఎవరిని చేర్చుకోవాలనే విషయంలో పార్టీ నిర్ణయమే తుది నిర్ణయమన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు పెట్టుకున్నా తీసుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామని చెప్పినా అప్పట్లోనే వారిని పార్టీలోకి తీసుకోలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయిన వారందరినీ తిరిగి పార్టీలోకి తీసుకునే విధానం ఉండదని, పార్టీ ప్రయోజనాలు, భవిష్యత్ రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పరిమితంగానే నిర్ణయాలు తీసుకుంటామని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం పనిచేశా. ప్రజా ఉద్యమాల్లో ఉన్నా. అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ ఎదిగినవాడిని. నిర్బంధాలు ఎదురైతే పారిపోయే వ్యక్తిని కాదు. పదవులు ఉన్నా లేకపోయినా, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్యే ఉంటున్నా. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్నా. ఒక మాట మాత్రం చెబుతున్నా.. జంగా అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఒక వ్యవస్థ. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేకంగా పనిచేసే సైన్యం ఉంది. అక్కడి ప్రజలతో, కార్యకర్తలతో నాకు ఉన్న అనుబంధం అలాంటిది. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో నా పాత్ర కీలకంగా ఉంటుంది. పదవుల కోసం నా రాజకీయ ప్రస్థానం మొదలుకాలేదు. ప్రజల కోసం పనిచేయడం నుంచే నా ప్రయాణం మొదలైంది. ఎన్నో కష్టాలు, నిర్బంధాలు, ఒడిదుడుకులు దాటుకుంటూ ఈ స్థాయికి వచ్చా. ఇక ముందూ ఎలాంటి పరిణామాలు ఎదురైనా సిద్ధంగానే ఉంటానంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!

# జంగా అంటే.. వ్యక్తి కాదు.. వ్యవస్థ

## ప్రశ్నించడమే నా రాజకీయానికి పునాది

మొదటి నుంచీ మాది కాంగ్రెస్ పార్టీ కుటుంబమే. మా నాన్న సర్పంచ్‌గా పనిచేశారు. అయితే నేను మాత్రం పాఠశాల దశ నుంచే విద్యార్థి రాజకీయాల్లోకి వచ్చా. ప్రజల కోసం పనిచేయడం అప్పుడే ప్రారంభించా. ప్రజా ఉద్యమాల్లో కలిసిపోయి పనిచేస్తున్న సమయంలో అప్పటి ప్రభుత్వాల నుంచి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నా. పోలీసుల నుంచి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్న సందర్భాలున్నాయి. కానీ ఆ కష్టాలు నన్ను ఎప్పుడూ వెనక్కి నెట్టలేదు. పైగా అవే నాలో పోరాట స్ఫూర్తిని పెంచాయి. నన్ను ఒక శక్తిగా తీర్చిదిద్దాయి. నా విద్యార్థి దశలో రాజకీయ గురువు సుధాకర్‌గాంధీ. ఆయన వల్లే ప్రజా ఉద్యమాల్లోకి వచ్చా. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం నేర్చుకున్నా. ప్రశ్నించకుండా ఉంటే సమస్యలు పరిష్కారం కావు. ప్రజల కోసం ప్రశ్నించినప్పుడే ప్రజలు మన వెంట నడుస్తారు. ఆ నమ్మకంతోనే ఇన్నేళ్లుగా పనిచేస్తున్నా. నిర్బంధాలు ఎదురైనా, కష్టాలు వచ్చినా, రాజకీయ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ప్రజల మధ్యే ఉన్నా. పారిపోయే రాజకీయాలు నాకు తెలియవు. ప్రజల కోసం పోరాడినప్పుడే నాయకుడిగా గుర్తింపు వస్తుందని నమ్ముతా.



**ఐదు నియోజకవర్గాల్లో నాకు స్పష్టమైన ఓటు బ్యాంకు!**

విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం పోరాటం

నిర్బంధాల నుంచే నా నాయకత్వ ప్రస్థానం

ఇప్పుడంతా పవర్ అండ్ మనీ పాలిటిక్స్..

డీసీసీబీ, ఆయిల్‌ఫెడ్ బాధ్యతల్లో రైతుల సంక్షేమమే నా లక్ష్యం

గ్రేటర్ వరంగల్ మేయర్ రేసులో ఉన్నా

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా బరిలో ఉంటా


ఎలాంటి పరిణామాలకైనా సిద్ధపడే ఉన్నా

అవసరమనుకుంటే నా చిన్న కూతురు నిఖితారెడ్డి రాజకీయాల్లోకి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తాజా మాజీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

## జంగా బలం.. ఐదు నియోజకవర్గాల్లో

జంగా అంటే ఒక వ్యక్తి మాత్రమేనని ఎవరూ అనుకోవద్దు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో నాకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. ముఖ్యంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నాకు ప్రత్యేకంగా పనిచేసే సైన్యం ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలతో ఉన్న అనుబంధం, కార్యకర్తలతో ఉన్న సంబంధం నాకు ఈ బలాన్ని ఇచ్చాయి. నేను పదవిలో ఉన్నప్పుడు మాత్రమే నియోజకవర్గాల్లో తిరిగిన వ్యక్తిని కాదు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటున్నా. గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉంటున్నా. అందుకే అనేక నియోజకవర్గాల్లో నాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి ఎక్కడ అవసరం ఉన్నా అక్కడ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం నా వంతు కృషి చేస్తా. నా రాజకీయ బలం ఒక్క నియోజకవర్గానికే పరిమితమైనది కాదు. కార్యకర్తలతో నాకు ఉన్న అనుబంధం, ప్రజలతో ఉన్న సంబంధమే నా బలం.



## మేయర్ రేసులో ఉన్నా

అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ నన్ను గుర్తిస్తుందన్న నమ్మకం నాకు ఉంది. పార్టీపై నాకు చాలా నమ్మకం ఉంది. గ్రేటర్ వరంగల్ ప్రజలు కూడా నన్ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్న నమ్మకం ఉంది. రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్‌గా రేసులో ఉన్నా. నా చిన్న కూతురు డాక్టర్ నిఖితారెడ్డి కూడా అవసరమైతే రాజకీయాల్లోకి వచ్చి బరిలో ఉంటుంది. గ్రేటర్ ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక దశాబ్దాలుగా కృషి చేస్తున్నా. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నా. మహిళలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నా. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సీరియస్‌గా పనిచేస్తున్నా. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల్లోకి వెళ్లడం కాదు.. నిత్యం ప్రజల మధ్య ఉండటమే నా రాజకీయ విధానం.

## డీలిమిటేషన్ ఎలా ఉన్నా.. అసెంబ్లీ బరిలో పక్కా

దేశవ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతోంది. తెలంగాణలోనూ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాల రూపురేఖలు కూడా మారవచ్చు. డీలిమిటేషన్ అంశాన్ని నేను ఆసక్తిగా గమనిస్తున్నా. నియోజకవర్గాల పునర్విభజన ఎలా జరుగుతుందో చూడాలి. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం నేను కచ్చితంగా బరిలో ఉంటా. ఎక్కడి నుంచి అనేది డీలిమిటేషన్ తర్వాత నిర్ణయించుకుంటా. కాంగ్రెస్ పార్టీ పెద్దలు కూడా నా పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారన్న నమ్మకం ఉంది. అనేక ఎన్నికల్లో పార్టీ పెద్దలు, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేశా. ఎక్కడా ధిక్కరించలేదు. ఈ క్రమంలో సీనియర్ నాయకుడిగా రాజకీయంగా, ఆర్థికంగా చాలా నష్టపోయా. అయినా పార్టీ కోసం పనిచేయడం ఆపలేదు. పదవులు నాకు ముఖ్యం కాదు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయడమే ముఖ్యం. ఇన్నేళ్లుగా పార్టీకి చేసిన సేవకు వచ్చే ఎన్నికల్లో మంచి అవకాశం ఇస్తుందన్న నమ్మకం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా స్వీకరించి పనిచేస్తా.



## రెండుసార్లు ఏకగ్రీవంగా.. ఆ తర్వాత డీసీసీబీ

కాంట్రాక్టర్‌గా, వ్యాపారవేత్తగా పనిచేస్తూనే రాజకీయాల్లోకి వచ్చా. సీరియస్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కాజీపేట దర్గా పీఏసీఎస్ చైర్మన్‌గా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశా. రైతులతో నేరుగా అనుసంధానమై ఉండే బాధ్యత కావడంతో దానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చా. జిల్లా రైతులకు మేలు చేసేలా అనేక కార్యక్రమాలు చేపట్టా. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వారి జీవితాల్లో వెలుగులు నింపడం లక్ష్యంగా పనిచేశా. డీసీసీబీని మరింత బలోపేతం చేయడానికి కూడా కృషి చేశా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర సీడ్స్ అండ్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. ఆ బాధ్యతను కూడా రైతుల కోసమే ఉపయోగించుకున్నా. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కోసం అహర్నిశలు పనిచేశా. తెలంగాణవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగు పెరగడానికి కృషి చేశా. రైతులకు దీర్ఘకాలికంగా లాభదాయకంగా ఉండే పంటగా ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించా. రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే నా ఆలోచన. నేను ఏ పదవిలో ఉన్నా రైతుకు ఉపయోగపడే పని చేయాలన్నదే నా ప్రయత్నం.

## రాజకీయాల్లో విలువలు పోయాయి..

రాజకీయాలతో పాటు పాత్రికేయ రంగం కూడా కొంత కలుషితమైందన్న బాధ నాకు ఉంది. ఒకప్పుడు రాజకీయాల్లో నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడు అధికారం, డబ్బు చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. దీంతో ప్రజా ప్రయోజనాలు వెనక్కి వెళ్లి వ్యక్తిగత ప్రయోజనాలే ముందుకు వస్తున్నాయి. రాజకీయాలు ప్రజల కోసం ఉండాలి. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఉండాలి. కానీ వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధానమైతే ప్రజలకు నష్టం జరుగుతుంది. పాత్రికేయ రంగంలోనూ కొన్ని మార్పులు వస్తున్నాయి. అయినా పత్రికలు ప్రతిపక్ష పాత్ర పోషించాలి. జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలబడాలి. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రభుత్వాలు చేస్తున్న మంచి పనులను రాయడంతోపాటు తప్పులు జరిగితే ప్రశ్నించాలి. ప్రజల కోసం రాయాలి. ప్రజల గొంతుకగా నిలబడాలి. పత్రికలు, జర్నలిస్టులు ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉంటేనే ప్రభుత్వాలు కూడా ప్రజల కోసం పనిచేసే పరిస్థితి ఉంటుంది. ప్రజా ప్రయోజనాలను కాపాడే బాధ్యతలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం. నేను ఇప్పటివరకు ఎన్ని పదవులు వచ్చినా వాటిని ప్రజలకు, పార్టీకి ఉపయోగపడేలా పనిచేశా. ఇక ముందూ అదే విధంగా పనిచేస్తా. గెలుపు, ఓటమి రాజకీయ జీవితంలో సహజం. కానీ ప్రజల మధ్య ఉండటం, పార్టీ కోసం నిలబడటం మాత్రం నా చేతిలో ఉంది. అందుకే ఎలాంటి పరిణామాలు ఎదురైనా సిద్ధంగానే ఉన్నా.

ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266